Reg. No. 757.

అభినవసరస్వతి

యనునొక మాసపత్రిక

అష్టావధాని జానపాటి పట్టాభిరామశాస్త్రిచే
ప్రచురింపఁబడుచున్నది.

జానపాడు.

సంపుటము 17 { 1925 సం॥ నవంబరు నెల } సంచిక 8

విషయములు.

పత్రికాధిపతి.

చందానిర్ణయము సంవత్సరమునకు

ప్రధానపోషకులకు	రు 25 0 0	సహాయులకు	రు 5 0 0
పోషకులకు	రు 10 0 0	చందాదారులకు	3 0 0

Printed at the Chandrika Press, Guntur,
and published at Janapadu by the Editor, Astavadhani
Janapati Pattabhirama Sastry.

ప్రధానపోషకులు.

౧ శ్రీ శ్రీ జగద్గురు పుష్పగిరి స్వాములవారు, కస్థల.
౨ బాకరాజు పరాంకుశరావుదేశాయిగారు. యాడవరం.
౩ రామశింగుగారు- నెల్లుట్లసాపురసంస్థానముల మేనేజరు- నెల్లుట్ల.

పోషకులు.

౧ శ్రీ శ్రీ జగద్గురు అభినవ విరూపాక్ష పీఠాధిపతులు.
౨ ఎనమండ్ర లక్ష్మీనరసింహముగారు, మర్చెంటు, బెజవాడ.
౩ రాజా వెంకటాద్రిఅప్పారావు, బహదరుగారు, వుయ్యూరుయెస్టేటు.
౪ రాజామంత్రిప్రగడ. వెంకటహనుమంతరావు, రాఘవరావుగార్లు, లింగగిరి.
౫ తంగెడ నరసింహారావుగారు, కరణం, మోర్జంపాడు.
౬ శ్రీరామయాంబికా పుస్తకభాండాగారము, లక్ష్మీనర్సాపురము.
౭ లింగాల వెంకటరెడ్డి దేశముఖుగారు, కుందవరము
౮ చారబుడ్డి రత్నారెడ్డిపటేలుగారు, న్యాలపోగుల
౯ లింగాల సీతారామరెడ్డి బండారెడ్డి, దేశముఖుగార్లు- నారాయణపురము
౧౦ టి. లక్ష్మణసింగుగారు, జొనగాం
౧౧ నెల్లుట్ల నరసింహారావుగారు, జొనగాం
౧౨ రంగాచార్యులుగారు, ముక్త్యారు, దేశముఖు, ముసలాపురము.
౧౩ టేకులపల్లి కృష్ణారెడ్డిగారు, ముసలాపురము.
౧౪ జాగర్లమూడి కుప్పుస్వామినాయఁడుగారు, కారంచేడు
౧౫ పిశుపాటి వెంకటరాయశర్మగారు, కరవది
౧౬ యార్లగడ్డ రంగనాయకులు నాయఁడుగారు, కారంచేడు
౧౭ తడిసిన గోపాలరెడ్డిదేశాయిగారు - దొంతి
౧౮ గూడూరి వీరసాంబశివరావు సర్దేశపాండ్యాగారు, మానెకొండూరు
౧౯ పొట్లపల్లి జగన్నాథరావు దేశముఖుగారు, అశ్వారావుపల్లె

సహాయులు

౧ వావిళ్ళ వెంకటేశ్వరశాస్త్రిగారు, చెన్నపట్టణము.
౨ బుడంపాటి సుబ్బయ్యగారు, మర్చంటు, కాకినాడ
౩ శ్యామాపంతుల వెంకటేశ్వరరావుగారు, తహశీల్దారు, సిరిసిల్ల.
౪ పెద్దిభట్ల వీరయ్యగారు, ప్లీడరు బెజవాడ
౫ నెల్లుట్ల కేశవరావు దేశముఖుగారు, నెల్లుట్ల
౬ రంగావఝల రంగయ్యగారు, నర్సారావుపేట
౭ నారాయణరావుగారు, దాతారుపల్లె

అభినవసరస్వతి

సంపుటము ౧౭ { జానపాడు. క్రోధన సం॥ కార్తికమాసము } సంచిక ౮

నిజామురాష్ట్రాంధ్రులస్థితి.

సీ॥ వేదశాస్త్రశ్రౌతవిద్వాబ్రాహ్మణావృతధర్మపుర్యాదు లెద్దానఁగలవు
ప్రజలు పూర్వాచారపరులౌచువర్తింతు రెచట సమాయికవృత్తితోడ
ప్రతిమానిసికిని దేవబ్రాహ్మణులయెడ భక్తివిశ్వాసము ల్వరఁగుదేన
దేశముఖ్ దేశాహి దేశపాండ్యాదుల ధర్మనిష్ఠయ యదాధారభూమి
మెందుఁ బిన్నపెద్ద లెల్లరుఁ బరమార్థచింతగలిగియుండ్రు స్వాంతములను
ఆ నిజామురాజ్యమంతకు హైదరాబాద రాజధాని పాపహాని ౨౦
సీ॥ ఏరాజ్యమందున నింకను జనులకు హూణవాక్పాండిత్య మమరదయ్యె
ఏరాజ్యమందున నింకను దఱచుగా సంఘసంస్కృతులంచు సాగకుండె
ఏరాజ్యమందున నింకను ద్విజులు కర్మభ్రష్టులగుటకుం బాలుపడరు
ఏరాజ్యమందున నింకనుబ్రజకు బ్రహ్మద్వేష ముద్భవంబగుటలేదు
ఇంక నేరాజ్యమందున నెల్లజాతు లొకటిగాఁజేయ సుది దీక్షలూనఁబడవు
అట్టిరాజ్యానకంతకు హైద్రబాద తాఁ బ్రధానపురంబౌచుఁ దనరు ధాత్రి, ౨౧
(స్కాందమహాపురాణాంతర్గత నాగరఖండము. ప్ర॥ ఆ॥)

ఈపద్యము లీపత్రికయందు దుందుభి సం॥ చైత్రమాసమునఁ బ్రకటింపఁబడినవి. ఇదియునుంగాక

“కలిసమావేశంబున బహుజనులు పాపపరాయణులును వర్ణాశ్రమాచారవిహీనులును నీచసేవారక్తులును నిమ్నజాతిప్రవిష్టమనస్కులును బ్రాహ్మణనిందామాత్రప్రయోజనులును ఖండాంతరగమనతత్పరులును రజస్వలా విధవావివాహబద్ధకంకణులును నై యున్నయీకాలంబున ధర్మశీలురను సదాచారరతులును దేవబ్రాహ్మణభక్తి విశ్వాససహితులును నాచరితయజ్ఞయాగాదిశ్రౌతవిహితకర్ములును గడు స్వల్పముగనుండియుండిరనుట పునరుక్తము. తెలివితేటలు విశేషించి నాగరికత బలసినకొలఁది సన్మార్గము సన్నగిల్లుటయు దుర్మార్గము

వృద్ధినొందుటయుం గానవచ్చుచున్నయది. అందు నిజాము రాష్ట్రమునం జాలభాగము నాగరికత యింకను ప్రబలక జనము చాలవఱకుం బూర్వాచారపరాయణమయియే వర్తిలుచున్నయది. అచ్చటిబ్రాహ్మణు లింతవఱకు స్నానదానవిముఖులును సంధ్యాకర్మదూరులును విధవోద్వాహవాదులును శిఖాయజ్ఞోపవీత రహితులును ధృతకవచభోక్తలును గంధాద్యలంకారశూన్యవక్త్రులును నై చండాలాదులు స్పృశించినవసనములతోడనే భుజించుట లేదు. వైశ్యశూద్రాదులకు బ్రహ్మద్వేష మతిశయింపలేదు. ప్రతిసంఘమందును మహాజనసభలు ప్రత్యబ్దము బయలు వెడలలేదు. అట్లుకాక బ్రాహ్మణులు వేదశాస్త్రాదులనే పఠించి యజ్ఞయాగాదు లాచరించుచుం బురాణప్రవచనాది స్వవర్ణోచితవృత్తులవలననే కాలముగడపుచుండుటయు వైశ్యశూద్రాదులు వారియం దత్యంతభక్తితత్పరులై తామును స్వవర్ణోచితధర్మములవలననే తత్పోషణభారమున్వహించి మెలంగుటయుం బ్రచురముగాం గన్పట్టుచున్నయది. ఇట్లనుటచే నితరదేశములం దిట్టి సజ్జనులు బొత్తిగా లేరని మాయభిప్రాయమైనట్లు గ్రహింపకుండుటకై చదువరులు ప్రార్థితులు. ఆ పూర్వోక్తమగు నిజామురాజ్యమునం జాలభాగము జమీందారు లుత్తమశూద్రులలోం జేరిన పంటకాపులు. వారి సౌజన్యాతిశయము దానధర్మపండితసత్కారాదులలో జగత్ప్రసిద్ధివడసిన యాత్మకూరు గద్వాల వనపర్తిప్రభువులు తద్వర్ణజులనుటచేతనే లోకులకు విశదపడగలదు. అట్టివానితో మెదకుజిల్లాయందుంగల దొంతి సంస్థానపు విద్వాంసులే యేతత్పౌండరీకయాజులు.”

(పౌండరీక యజ్ఞవైభవము.)

ఈపంక్తులు ప్రమాదిసంవత్సరమార్గశిరమాసమునం బ్రకటితములు. కాని యీనిజాము రాష్ట్రమునంగూడ నప్పటికి నిప్పటికిం గొన్ని మార్పులు కలిగిపోయినవి. అందు గుణాగుణములు రెండును గలవు.

ఆనివరమంతయు మఱియొకపరి తెలుపఁదలఁచి ప్రకృతము రుధిరోద్గారి మార్గశిరమాసమునఁ ప్రబుద్ధాంధ్రలోఁ బ్రకటితమగు నిజాము రాష్ట్రాంధ్రులస్థితి సవిస్తరముగాఁదెలుపఁగల కంభంపాటి అప్పన్న శాస్త్రిగారి దీర్ఘవ్యాసమును బ్రకటించుచున్నవాఁడను.

ఆంధ్రులను గుఱించి వ్రాయుటకు ముందు ఆంధ్రదేశమును గుఱించి చెప్పవలసియున్నది. నిజాము రాష్ట్రముయొక్క పదియారుజిల్లాలయందును ఎనిమిది తెలుఁగుజిల్లాలు. అవి ౧ ఆత్రాఫ్‌బల్దా ౨ వరంగల్, 3 కరీంనగర్, ౪ నల్గొండ, ౫ మహబూబ్‌నగర్, ౬ నిజామాబాద్, ౭ మెదకు, ౮ ఆదిలాబాద్, అయియున్నవి. నిజాము రాష్ట్రముయొక్క మొత్తము వైశాల్యము ౮౨౬౯౮ చదరపుమైళ్ళు. అందు తెలుగుజిల్లాల వైశాల్యము ౪౧3౪౧ చదరపుమైళ్ళు.

జ న స ం ఖ్య

మొత్తము రాష్ట్రముయొక్క జనసంఖ్య ౧౨౪౭౧౭౭౦. అందు తెలుగుజిల్లాలలోని జనసంఖ్య ౬౪౧౯౨౯౮. నిజాము రాష్ట్రమున తెలుగు మాతృభాషగాఁగలవారు ౬౦౧౫౧౭౪ గురు. మహారాష్ట్రులు 3౨౯౬౮౫౮ గురు. కర్ణాటకులు ౧౫3౬౨౬౮ గురు. తెలుగువారి సంఖ్య కర్ణాటకమహారాష్ట్రుల మిళిత సంఖ్యకంటె అధిక మని దీనిని బట్టి తెలియుచున్నది.

రాష్ట్రమంతయు వరంగల్, మెదకు, గుల్బర్గా, ఔరంగాబాద్ అని నాల్గు సుబాలుగా విభజింపబడి యున్నది. అందు మొదటి రెండును తెలింగానాకు చేరియున్నవి. ఆంధ్రభాగమున నుండు హిందువులసంఖ్య ౫౨౮౬౪౯౯. అనగా నూటికి ౮౮ గురు హిందువు లున్నారు. మహమ్మదీయుల సంఖ్య 33౧౫3౫ అనఁగానూటికి ౫.౫ మంది యున్నారు. ఇతరులు 3౯౭౦౭౭ అనగా నూటికి ౬.౫ ఉన్నారు. వీరందరును ఆంధ్రులనఁ దగినవారు.

స్వభావస్థితి — నైసర్గికానుకూలములు.

తెలంగాణాయందలి భూమి మిట్టపల్లములు గల్గియుండి మిక్కిలి సారవంతమైయున్నది. వరంగల్ జిల్లాలో దట్టములయిన అడవు లనేకములు గలవు. అందు పులులు, ఎలుగుగొడ్లు, మొదలగు క్రూరజంతువులుగూడఁ గలవు. ఈయడవులలో ముఖ్యమయినవి శ్రీ నైజాముగారికి మృగయావినోదార్థము ప్రత్యేకింపఁబడినవి. తెలంగాణాయందు లెక్కలేనన్ని చెరువులు గలవు. ఇతరప్రాంతములయం దివి బొత్తిగాతక్కువ. ఇక్కడ అడవు లధికమగుటవలన వర్షములు అధికముగా కురియును. వరంగల్ జిల్లాలో చాలభాగము, రాళ్ళు గుట్టలుగల రాతినేల. కొంత ప్రదేశముమాత్రము మిగుల ఫలవంతము అయిన రేగడభూమి.

ఆంధ్రుల పూర్వచరిత్రము.

నిజామురాష్ట్రమునందలి ఆంధ్రభూభాగమున మహమ్మదీయుల యాక్రమణమునకు పూర్వమునను, తరువాతను, అనేకాంధ్రరాజ్యములు మహావైభవము ననుభవించి కాలక్రమమున క్షీణించినవి. పాడుపడిన అనేకదుర్గము లిప్పటికిని పూర్వపు ఔన్నత్యమును ప్రకటించుచున్నవి. మొట్టమొదట కాకతీయప్రభువులు సామ్రాజ్యాధిపతులై యుండిరి. వారికి రాజధాని అనుమకొండ. వారు ౧౦ వ శతాబ్దివఱకును జైనమతస్థులుగానుండి ఈదేశమున ఆమతమును వ్యాపింపఁజేసి జినదేవత యగు కాకతియనుపేరున వారు కాకతీయులని పిలువఁబడుచు వచ్చిరని ప్రఖ్యాతిగలదు. వారి కీర్తి దిగంతములవఱకును వ్యాపించుటకు కారణము మొదటి ప్రతాపరుద్రుఁడును, గణపతిదేవుఁడును, ఇతని కొమార్తయగు రుద్రమదేవియు, ఆమెకొడుకగు రెండవప్రతాపరుద్రుఁడును మొదలగు వారి శౌర్యాతిశయమే. ఈనలువురపాలనమునను విభాగములయి యున్న ఆంధ్రదేశము ఒక్కటియయ్యెను. వీరి సామ్రాజ్యమునకు త్రిలింగ సామ్రాజ్యమని ప్రఖ్యాతి గలిగినది.

ముఖ్యముగా రుద్రమదేవికాలమున శాంతి ప్రజాభివృద్ధి అత్యధికములై యుండెను. వీరి పరిపాలనకాలమున, ఆంధ్రదేశమంతయు మహాసౌధములతోడను, దుర్గములతోడను, గొప్పపట్టణములతోడను, దేవాలయములతోడను విరాజిల్లి ఓడమీఁద వర్తకము తూర్పుతీరమున జరుగుచుండెడిది. వీరందఱును శైవమతావలంబకులు గావున తన్మత వ్యాప్తియు, జైనమత నాశనమును వీరిపరిపాలనా ఫలితములని చెప్పవచ్చును. అట్లే ఆంధ్రభాషకును వీరొనరించిన మహోపకార మనంతము. ౧౩ వ శతాబ్దమువఱకును నిరాఘాటముగ జరిగిన వీరి వైభవము మహమ్మదీయుల దాడివలన క్షీణించెను. ఈరాజ్యము భిన్నభిన్నములై ఆయాభాగముల అధిపతులు ఢిల్లీపాదుషాకు సామంతులుగా నుండి జోహారు లొనరించుచుండిరి. తరువాత విజయనగర రాజ్యము ఆంధ్రపతాకము నెత్తినది. ఈరాజ్యమునకు మూలమైన ఆనగొంది నిజామురాష్ట్రము నందలి రాయచూరి జిల్లాలో నున్నది. తాళికోటయుద్ధముతో నది యంతరించెను. అటుతరువాత గోలుకొండరాజ్యకాలమున ఆంధ్రులవైభవము పెంపెక్కెను. తానీషా కాలమున ఆతని ముఖ్యమంత్రియగు మాదన్నగారును ముఖ్య సేనాధిపతియగు అక్కన్నగారును, తమకార్యములను అత్యంత నైపుణితో నిర్వహించి దిగంత విశ్రాంతమయిన కీర్తిని సంపాదించిరి. ఇప్పటికిని వీరివంశమువారు హనుమకొండయం దున్నారు. కంభంమెట్టు, భోనగిరి, దేవరకొండ మొదలగు వానియందలి కోటలన్నియు శిథిలములై ప్రాచీనచరిత్రములు జ్ఞాపకముచేయుచున్నవి. వడ్డెపల్లి రాజధానిగా గలిగిన నతలవాటిసీమ అనఁబడు మధిరజిల్లాలోని రాజులు కాకతీయులతో సమానబాంధవ్యములు సలుపుచు రాజ్యాక్రమణమున వారి కెంతయు తోడ్పడియుండిరి. నతలవాటిసీమను పరిపాలించినవారిలో బుద్ధరాజొకఁడు. వనపర్తికి సమీపమున

శిథిలమై యున్న వర్ధమానపురమును (వడ్డెమానిని) ల వ శతాబ్దము నుండియు ప్రాచీనాంధ్రచోళులలో నొక శాఖవారు ఏలిరి. ఆపట్టణము మీఁద మొదటి ప్రతాపరుద్రుఁడు దండెత్తి దాని లోఁబఱచుకొని యెను. తనకు భయపడి పాఱిపోయిన భీమచోళుని సామంతరాజుగాఁ జేసికొని ఆతని కొమార్తయగు పద్మావతిని ఆతఁడు పెండ్లి చేసికొని యెను. ఈవడ్డెమాని (పు) గ్రామము పూర్వ మొక మహాపట్టణమై అనేక దేవాలయములతో విరాజిల్లుచుండెడిదని ఆంధ్రులచరిత్రము నుడువుచున్నది.

ఇప్పటికిని నిజామురాష్ట్రమునందున్న సంస్థానములన్నియు ఇంచు మించుగా తెలంగానాకె చెందియున్నవి. గద్వాల, వనపర్తి, పాల్వంచ, దోమకొండ, అమరచింత, గోపాలపేట, ఆనెగొంది, జటప్రోలు, మున్నగు సుప్రసిద్ధసంస్థానము లన్నియు ఆంధ్రదేశమున నున్నవే. ఈసంస్థానములను పాలించు ప్రభువులందఱును ఆంధ్రులే.

ప్ర స్తు త స్థి తి.

నిజామురాష్ట్రము యొక్క పూర్వపుస్థితికిని ఇప్పటిస్థితికిని హస్తికిని మశకమునకు నున్నంత యంతరమున్నది. అయినను ఆధునికనాగరిక మాహాత్మ్యము వలన మనపూర్వు లనుభవింపని అనేకసౌకర్యములను మన మనుభవించుచున్నాము. ఈక్రిందివిషయములు చూచిన ప్రస్తుత స్థితి సుబోధమగును.

మొదటిదివిద్యాస్థితి. హైదరాబాదు సికిందరాబాదు పట్టణములు తెలుఁగు భాగమునకు చేరినవే. ఈపురములయందు ఆంధ్రులసంఖ్య ఇతరులసంఖ్యకు సమముగనో యెక్కువగనో యున్నదనుటకు సందియము లేదు. అయినను ఆంధ్రేతరుల ప్రాముఖ్యమే అధికముగా నున్నదనుట నిర్వివాదాంశమగు శోచనీయవిషయము.

శ్రీ నైజాముగారు క్రొత్తగా స్థాపించిన ఉస్మానియావిశ్వవిద్యాలయము గమనింపఁదగినది. అది చాలవరకు జాతీయపద్ధతులమీఁద నడుపఁబడుచున్నది. దానికి సంబంధించిన కళాశాలలో నొకటి యూనివర్శిటీవద్దనే యున్నది. రెండవది సికంద్రాబాదు పాఠశాల. మఱియొక సికంద్రాబాదు కాలేజీ గుల్బర్గాలో స్థాపింపఁబడఁబోవుచున్నట్లు వినుచున్నాము. మొదటి రెండు కళాశాలలలో చదువు ఆంధ్రబాలుర సంఖ్య ఇతరులసంఖ్యకంటె చాల తక్కువ. మహారాష్ట్రు లెక్కువగా నున్నారు. నిజాంకళాశాల మదరాసు యూనివర్శిటీకి సంబంధించినది. దీనియందలి తెలుఁగు విద్యార్థుల సంఖ్య ఉస్మానియాకళాశాలయందలి తెలుగువారిసంఖ్య కంటె అధికము. అయినను వీరిలో నిజామురాష్ట్రాంధ్రులు తక్కువగా నున్నారు. ఉస్మానియా కళాశాలలోనివా రీదేశమువారే. ఉస్మానియా కళాశాలయందలి తెలుగువిద్యార్థుల సంఖ్య సుమారు ౨౦. నిజాము కళాశాలయందలి సంఖ్య ౫౦. సిటీకాలేజీయందలి సంఖ్య ౩౦ అని తెలియుచున్నది.

స్కూలుఫయినలుబోర్డు ఒకటి ఈరాష్ట్రమున నిజాము సర్కారువారిచే నెలకొల్పఁబడియున్నది. ఈవిద్యాశాఖ అధికారక్రింద కొన్ని ఉన్నతపాఠశాలలును, కొన్ని మాధ్యమిక పాఠశాలలునున్నవి. తెలుఁగు జిల్లాయగు వరంగల్‌నందు మిడిల్‌స్కూ లొకటి, స్త్రీల కొకటి, పురుషులకొకటి ట్రెయినింగుస్కూళ్ళును గలవు. చాలస్థలములయందు ఉస్మానియాకళాశాలలకు సంబంధించిన ఉన్నతపాఠశాలలు నెలకొల్పఁబడుచున్నవి. ఇకముందు స్కూలుఫయినలుబోర్డునకు సంబంధించినవి తగ్గిపోవునని తోఁచుచున్నది.

... ...

N. B. శ్రీనైజాం సర్కారువారు ప్రాథమికవిద్యను ఉచితముగా గరపుట కాజ్ఞ యిచ్చినారు. ఎనిమిది జిల్లాలలోను చదువు వచ్చినవారి సంఖ్య ౧౫౯౫౩౦౭ అనగానూటికి ౨.౬. మాత్రమే.

కృషివాణిజ్యములు.

ఈదేశీయులలో చాలమంది వ్యవసాయమే వృత్తిగా గలిగి జీవించుచున్నారు. పూర్వకాలమునుండియు వీరు కృషియందు నూతన పద్ధతు లేమియు నవలంబించుట లేదు. సర్కారు ప్రతిజిల్లాయందును సహకారసంఘములను స్థాపించియున్నారు. వీరి వ్యవసాయమునకు చెరువులును, బావులు సాయపడుచున్నను మొత్తముమీద ముఖ్యాధారము వర్షమే అని చెప్పవచ్చును. ఈదేశమున ఉన్న చెరువులలో గండిపేట, పాకాల, రామప్ప, హుసేనుసాగరు, హిమాయతుసాగరు, అనునవి ముఖ్యమైనవి. గండికోట చెరువునందలినీరే హైదరాబాదు నగరమునందలి జనులయుపయోగార్థము గొట్టములలో తేబడుచున్నది. దీనిని హైదరాబాదునకు పండ్రెండుమైళ్ళ దూరమున ఆరులక్షల రూపాయలకు పైగా ఖర్చుచేసి నైజాముగారు కట్టించినారు. దీనిలోని నీటి వలన అనేకలక్షల యకరముల భూమి సాగుబడి చేయవచ్చునని తెలియుచున్నది. హుసేనుసాగరములోని నీరు సికందరాబాదు ప్రజలకు సరఫరా చేయబడుచున్నది.

—• పరిశ్రమలు •—

నిజాము రాష్ట్రమునందంతటను స్థాపింపబడిన ౧౯౨ పారిశ్రామికాలయములలో ౭౭ మాత్రమే తెలుగుజిల్లాలలో నున్నవి. ఇవన్నియు ప్రత్తినుండి విత్తులను తీయునవియో, ధాన్యమునుండి బియ్యము చేయునవియో యై యున్నవి. నేత కొత్కాటియైనను లేదు. ఆయురువదియేడైనను ఒక్క వరంగల్లుజిల్లాయందే కలవు. ఇక్కడ

రాట్నపునూలుతో బట్టలు నేయు ఆచారము మొదటినుండియుఁ గలదు. అందువలననే భారతదేశము యొక్క ఇతర భాగములకు ఖద్దరు విశేషముగా ఎగుమతి యగుచున్నది.

తెలుఁగువారి చేతిపనులలో మట్టివాడ, అంబాలజంబుఖానాలు, తివాసీలు, సంగారెడ్డిపేట పట్టుబట్టలు, సిద్దిపేటధోవతులు, చీరెలును, మహబూబు నగరుగొంగళ్లును, గద్వాల చీరెలు, ధోవతులు, అమరచింతశల్లాలు, మల్లుబట్టలును, ప్రసిద్ధికెక్కినవి. అవికాక పెంబర్తి చెంబులు, ఇత్తడిసామానులు, కోదాటిదంతపుపనులు, కొమ్ము కలములు, చేతికఱ్ఱలు, దేవరకొండరుమాళ్ళు, కూడ మిక్కిలి ఘనత వహించినవి. లక్క-బొమ్మలు, మేనాలు, మట్టిబొమ్మలు, ఆయుధపు సామానులు, కఱ్ఱపనులు, మొదలగు అనేకములగు చిల్లరపను లింకను గలవు.

—• సాంఘికస్థితి •—

ఆంధ్రుల సంఘస్థితియొక్క నిజస్వరూపమును దెలిసికొన వలయుననిన ముఖ్యముగా నాలుగువర్ణములవారి స్థితిగతులును తెలిపినచో చాలును.

—• బ్రాహ్మణులు •—

ఈరాష్ట్రమున ముఖ్యముగా తెలంగానాయందు బ్రాహ్మణుల సంఖ్య తక్కువ. ఏవో కొన్ని నదీతీరములయందున్న గ్రామములయందును, హైదరాబాదు, సికందరాబాదువంటి పట్టణములయందును, తప్ప తక్కినచోట్ల ఒక్కొక్క గ్రామములో ఇద్దరుముగ్గురుకంటె నధికముగా నుండరు. కొన్నిగ్రామములలో బొత్తిగా లేనేలేరు. మంథెన, ధర్మపురి, గద్వాలమొదలగుచోట్ల బ్రాహ్మణులు అమితము గాగలరు. మంథెన ధర్మపురులయం దుండువారు తమలోతాము వియ్యములందుదురు. పైరెండు బ్రాహ్మణాగ్రహారములయందును

మంథెనకన్న ధర్మపురి వైదికవిద్యలకు నిలయమై యున్నది. అందు జట, ఘనలలో నారితేరిన వేదాధ్యయనపరులును, తర్క-వేదాంత వ్యాకరణమీమాంసాదిశాస్త్ర పండితులును, అనేకులు కలరు. వారి కందఱకును విస్తారముగ భూవసతులు కలవు. బీదవారు ఇతరదేశము లలో తఱుచు సంచారము చేయుచుందురు. మంథెన బ్రాహ్మణులు ధర్మపురి బ్రాహ్మణులతో నేవిషయమునందును తీసిపోనప్పటికిని, వారిలో అనేకులు వంట బ్రాహ్మణులుగా తయారగుచున్నారు. మంచి పండితోత్తములలోఁగూడ పాకశాస్త్రనిపుణులై తన్మూలము వలన ధనార్జనము చేయుట గలదు. వారు పాచకవృత్తిని హేయముగా చూడరు. వారిలో అనేకులు మహారాష్ట్రదేశమునకుఁబోయి యావృత్తి వలననే ధనార్జనము చేయుచుందురు. వారిలోక్రమముగా విద్యనశించి పాచకవృత్తియే మిగులుచున్నది. ఆయగ్రహారములలోనుండు వారంద ఱును ఇంచుమించుగా వైదికబ్రాహ్మణులు. ఇతరగ్రామములలోఁ గల వైదికులలో చాలమంది వ్యవసాయదారులుగను, కరణములుగను, పురోహితులుగను, ఒక్కొక్కరే ఈమూడువృత్తులు కలవారుగను గూడనున్నారు. వీరిలో యౌవనము దాటిన తరువాత కళత్రవియో గము సంభవించినచో మఱలవివాహము చేసికొందమన్న కన్యలు దొరకుటకష్టము అగుటచే అట్టివారు తరుచు పాల్ఘాటుపిల్లలను పెండ్లి యాడుటకలదు. ఒక్కొక్కపుడు ధనవ్యయమే గాక ఆకన్యలలో కొందరు బ్రాహ్మణపిల్లలనుపేరుతో తేఁబడిన బ్రాహ్మణేతరబాలిక లగుటగూడ తటస్థించి వర్ణభ్రష్టత్వముగూడ సంభవించుచుండును. కన్యావిక్రయమున పాల్గొనుటకు పాల్ఘాటులనుండివచ్చిన యేజంట్లు రాష్ట్రమంతయు సంచారము చేయుచు ఎవరికో యొకరికి టోపీ వేయుచునే యుందురు. ఇట్లు మోసముజరుగునను భయమువలన కొంతమంది ధనవ్యయప్రయాసలకోర్చి ఆదేశమునకే పోయి పెండ్లి

యాడి భార్యలను తెచ్చుకొనుచుండుట గలదు. వధూవరుల భాషలు భిన్నములగుటచే కొంతకాలమువఱకును ఆయేజంట్లు దుబాషులై కాలము గడపించుచుందురు.

నియోగులును, ప్రథమశాఖలును వరంగల్లుదాటిన తరువాత బ్రిటిషుసరిహద్దులలో విశేషముగ గలరు. వీరు జగ్గయ్యపేట, నందాల గుంటూరు ప్రాంతములవారితో బంధుత్వములు నెఱపుచుందురు. వీరు భూస్వాములును, గ్రామకరణములునై వైదికులకన్న ఐశ్వర్యముతో నున్నారు.

నిజామురాష్ట్రాంధ్రభూభాగమున గోలకొండ వ్యాపారు లధిక ముగానున్నారు. వీరి యార్థికస్థితియెంతయు కొనియాడదగినది. సాంఘి కోద్యమములయందేమి మఱియితరవిషయములలో నేమి ముందడుగు వేయుటలో వీరిని చెప్పి తక్కినవారిని చెప్పవలెను. మతరీత్యా చూచి నచో శైవులును, వైష్ణవులును, అనేకశిష్యులుగలిగియుండి తమతమ యాచారములను అబ్రాహ్మణేతరులలో వ్యాపింపించియున్నారు. అనుమ కొండ సామ్రాజ్యపుకడపటిదినములలో తెలంగాణాయందు శైవమతము అధికముగా వ్యాపించియున్నది. వైశ్యులు అనేకులు శైవులకు శిష్యు లైయున్నారు. శైవుల యాచారములు అనగా శివపూజ, పరిశుభ్ర ముగా నుండుట, అహింస, త్రాగుడులేకపోవుట మున్నగు సదాచార ములు బ్రాహ్మణేతరుల నైతికాభివృద్ధికి మూలములై యున్నవి. వైష్ణ వులనుగురించి ఇంతగా చెప్పుట కిచ్చట అవకాశముచిక్కదు.

క్ష త్రి యు లు

ఈదేశమున క్షత్రియులమని చెప్పుకొనువారు భిన్నభిన్నవృత్తు లవలంబించియున్నారు. యజ్ఞోపవీతములను ధరించినప్పటికిని బ్రిటిషు రాష్ట్రమున నున్న రాజులవలె నుండరు. గద్వాల వనపర్తి మొదలగు ప్రాంతములయం దట్టివారు కొలఁదిగా నున్నారట.

వైశ్యులు

దేశమందంతటను వైశ్యుల సంఖ్య అత్యధికముగా నున్నది. హైదరాబాదు, సికిందా్రబాదులలో వీరు నివసింపని ప్రదేశము లేదు. వీరిముఖ్యవృత్తి వర్తకమని వేఱుగ చెప్పనక్కఱలేదు. లక్ష్మీపుత్రు లన్నమాట వీరికే చెల్లును. వీరిలో విద్యగలదన అది లెక్కలువ్రాసి కొనుటకుమాత్ర ముపయోగించునంతటిదే. జ్ఞానాభివృద్ధి కనువగు నున్నతవిద్య వీరిలో లేదు. అన్నివర్ణములయందువలెనే వీరిలోగూడ కొన్నిదురాచారములు గలవు. వీరిలో ఆధునికనాగరికత కనుగుణము అగువృద్ధి కలిగించుటకు పాటుపడు సంఘములు స్థాపించుటకు ప్రయత్నములు జరుగుచున్నవి. అయినను మొత్తముమీద నూతనోద్యమములలో వీరు అంతగా పాల్గొనరు.

చతుర్థకులజులు

ఈదేశము పూర్వకాలమునుండియు రెడ్డిరాజుల పాలనము క్రింద నుండినది. ఇక్కడిచతుర్థకులజులలో చాలమంది ధనికులయిన వ్యవసాయదారులైయున్నారు. వీరిలో కొందఱు ఇచ్చటిరాజభాష నభ్యసించినవారునుగలరు. మాతృభాషయగు ఆంధ్రమును మఱచిపోయినారా యనునట్లు ఉందురు. ఇండ్లలోమాత్రము స్త్రీలతో తెనుగుభాషయే మాట్లాడుదురు. ఈదేశమునగల సంస్థానములన్నియు రెడ్లస్వాధీనము నందే యున్నవి. ఈసంస్థానముల అధీశ్వరుల నాశ్రయించుకొని అనేకులు సంస్కృతాంధ్రపండితులును, కవులును, సంగీతవిద్యానిపుణులును, ఎప్పుడును సత్కారములను పొందుచుందురు.

సంస్థానము లన్నిటిలో గద్వాల పెద్దది. రెండవది అనదగు వనపర్తి ఉచ్చదశలోనున్నదని చెప్పవచ్చును. ఈసంస్థానము చరిత్ర ప్రత్యేకముగా వ్రాసినచో చాల ఉపకారమగును. వనపర్తిలో రెడ్డి విద్యార్థుల కొరకు మాధ్యమికపాఠశాల, వసతిగృహమును రాజాగారి

పోషణమున నుండెడివి; గాని అవి యిప్పుడేకారణముచేతనో మొత్తి వేయఁబడినవి. విద్యాసక్తిగల రెడ్డివిద్యార్థులు ఇతరప్రాంతములకుఁ బోయి గొప్పపరీక్షలలో నెగ్గివచ్చుచున్నారు. వీరిలో కొందఱు తాము పూర్వకాలమున క్షత్రియు లయియుండి రానురాను యజ్ఞోపవీత విసర్జనము మున్నగునవి యవలంబించి నేటిస్థితిలో నున్నామని చెప్పెదరు. గతించిన జనాభాలెక్కలలో వీరిని శూద్రులుగా పరిగణించి నందున ఈరెడ్డిరాజులలో కొందఱు తమ అనిష్టమును దెలిపిరి. వీరిలో అనేకులు ఉన్నతోద్యోగములలోనున్నారు.

వెలమలు

వెలమదొరలు కరీంనగరుజిల్లాలో పెక్కుమందికలరు.

కురుములు, వెలగలు, మున్నూరు, జంగములు మున్నగువారెందఱో యున్నారు. వారిలో కొందఱు తమ తెగయొక్క ఔన్నత్యమును సాధించుకొనుటకు సంఘములను స్థాపించుకొని పాటుబడుచున్నారు. పంచములు అనఁబడువారు హైదరాబాదువంటి పట్టణములలో సేవకవృత్తిలో నున్నారు. వారిలోగూడ కొందఱు ఆదిమాంధ్రులమని చెప్పుకొనుచు సంఘములను స్థాపించుకొని స్వోన్నతికై పాటుబడుచున్నారు. గ్రామములలో వీరు కడుదీనస్థితిలో నున్నారని చెప్పనక్కరలేకయే అందఱకును తెలిసిన విషయము. వీరిలో క్రైస్తవ మతప్రవిష్టులైనవారు కలరు.

అవుసులవాండ్రు (కంసాలులు)

అవుసులవాండ్రు అని పిలువఁబడుచు స్వర్ణకారకులజులు దేశమునందంతటను గలరు. ఈసంఘము మిక్కిలి నీచస్థితియందున్నది. వీరుగూడ విశ్వబ్రాహ్మణసంఘ మను పేరున ఒక సంఘమును నడుపుచున్నారు. గాని పనిమాత్రము జరుగుటలేదు.

ఇచ్చటి సాంఘికులను గుఱించి క్లుప్తముగా చెప్పవలసివచ్చినచో ఈక్రిందివాక్యములలో తెలుపవచ్చును. ఈదేశమువారు మిక్కిలి పాటుబడుస్వభావము గలవారును, కాపట్యము నెఱుఁగనివారును, ధార్మికులునై యున్నారు. ప్రపంచమునంతను చలింపఁజేయుచున్న నూతన శక్తి వీరిలోను కార్యరూపమును దాల్చుచున్నది. వీరు ఆత్మగౌరవము కాపాడుకొనుటకై పాటుబడుచున్నారు.

ఆంధ్ర భాషా స్థితి.

నిజామురాష్ట్రాంధ్రభాగమున భాషావిషయమున పూర్వమునకును ఇప్పటికిని చాలభేద మున్నది. ఆంధ్రభాష నుద్ధరించిన కవీశ్వరులలో నిజామురాష్ట్రమువారిని తీసివేసితిమేని ఆమె అంగహీనయగును. ౧౨ లేక ౧౩ శతాబ్దముల వెనుకటి కవుల చరిత్రము చదివిన ఈవిషయము తెలియఁగలదు. ఆంధ్రరాజులు పాలించిన భూభాగము చాలవఱకు నిజామురాజ్యమునందున్నది. ప్రతాపరుద్రమహారాజు సంస్కృతాంధ్రములకుచేసిన మహోపకారము మఱువచ్చునదిగాదు. మఱియు నాటికవు లనేకులను గుఱించి తెలిసికొనవలసియున్నది. ఈ రాజులు అనేకులు శైవు లగుటవలన కవులుగూడ అనేకులు శైవులైరి. పాలకురికి సోమనాథుఁడు శైవ కవులలో నొకఁడు. అతఁ డనేకగ్రంథములు రచించియున్నాఁడు. అక్లే భీమకవి, పిల్లలమఱ్ఱి పినవీరభద్రకవి, గౌరనమంత్రి, రంగనాథుఁడు, బమ్మెర పోతనామాత్యుఁడు, మల్లారెడ్డి, సురభి మాధవరాయఁడు, ఎలకూచి బాలసరస్వతి, నెల్లుట్ల నారాయణకవి, కొణాద పెద్దన సోమయాజి, పరశురామపంతుల లింగమూర్తి, హరిభట్టు, శివదేవుఁడు, మున్నగువా రెందఱో గలరు.

౧౬, ౧౭వ శతాబ్దములలోఁగూడ దోమకొండ, గద్వాల, సంస్థానాధిపతుల యాశ్రయమునను, గోల్కొండ నవాబుల ఆశ్రయమునందును గూడ అనేక కవు లనేకగ్రంథములు వ్రాసిరి. పదునాల్గవ

శతాబ్దమున అద్దంకి గంగాధరకవి తపతీసంవరణ మను కావ్యమును వ్రాసి మల్కిభరామునకు కృతి యిచ్చెను. ఈకృతిపతి గోల్కొండ నవాబులలో మూఁడవవాఁడుగా నెంచఁబడు ఇబ్రాహీంముల్కు అను నతఁడు. ఈకాలమునందే పొన్నిగంటి తెలగన్న అను మఱియొక కవి అమీన్ఖాను అను ఒక సరదారునకు మఱియొక ఆంధ్రకావ్యమును కృతి యిచ్చెను. చేమకూర వేంకటకవి వరంగల్ జిల్లాలోని పాపకొల్లు ప్రాంతము నేలిన పాపారాయఁడు అను నరపతి ఆస్థానమున నుండెడి వాఁడు. ఇతఁడు ఆరాజుతో వైరము తెచ్చుకొని తంజావూరుపోయి రఘునాథరాజునకు తన కావ్యముల నంకితము చేసెను.

ఈప్రకారముగా కవి వృషభులనుగన్న ఈదేశము నేఁడు కవి యను నామము నన్వర్థము సేయఁగల ఒక్కఁడైనను లేకుండనున్నది. ప్రబంధయుగము దాటిపోయినది. నూతనపద్ధతులతో కవిత అల్లినఁ గాని ప్రజాదరణము లభింపదు. నిజాము రాష్ట్రాంధ్రకవులకు ప్రకృతము రాజాదరణము సున్న. ప్రజాదరణమును ఇంచుమించుగ అట్లేయున్నది. అయితే నిద్రపోవువారు మేల్కొనకుండ నెంతకాలము ఉందురు? అట్లే ఈదేశమువారుగూడ ఇప్పుడు మేల్కొనుచున్నారు. యువకు లనేకులు క్రొత్తమార్గములు త్రొక్కుటకు ప్రబలప్రయత్నములు చేయుచున్నారు.

ఇఁక వ్యావహారిక భాష నాలోచించెదము? ఉత్తరసర్కారుల వారు యథేచ్ఛగా ఇంగ్లీషుపదములను వాడుచున్నట్లే ఇచ్చటివారు ఉరుదుపదములను గ్రుమ్మరించుచున్నారు. ఉత్తరసర్కారులవారు ఇంగ్లీషుపదములు వాడినఁగాని భాషకు చైతన్యము లేదనుకొనెడువారు. నిజాముదేశపు టాంధ్రులకు ఉరుదు వాడినఁగాని అర్థముగాదు. ఇప్పు డిప్పుడు కలిగిన ప్రబోధమువలన మాతృభాషాభిమానము అధికమై

ఇక్కడివారు కొందఱు అందే నిరంతరము మాట్లాడుచు చర్చలు సలుపుచున్నారు. కొద్దికాలమునందే ఆంధ్రులందఱును మాతృభాషలో నిరాటంకముగా మాట్లాడుటకు సందియము లేదు.

గ్రంథాలయములు.

ఈదేశమున ఇప్పుడు గ్రంథాలయోద్యమము మిక్కుటముగా జరుగుచున్నది. రెండుసంవత్సరములనుండి ప్రతిస్థలమునందును గ్రంథాలయములు స్థాపింపఁబడుచున్నవి. గ్రంథాలయముల పట్టికయు వివరములు నీక్రింద చూపఁబడుచున్నవి.

హైదరాబాదు రెసిడెన్సీ బజారున ౧౯౦౧ వ సంవత్సరమున శ్రీకృష్ణదేవరాయల ఆంధ్ర భాషానిలయమును, అఫ్జుల్ గంజు (హైదరాబాదు) లో ౧౬ మెయి ౧౯౨౧ తేదీని శ్రీ బాలసరస్వతీ ఆంధ్ర భాషానిలయమును, శిద్దెంబరబజారు (హైదరాబాదు) లో రుధిరోద్గారి నిజజ్యేష్ఠ బ ౭ నాఁడు శ్రీ వేమన గ్రంథాలయమును, బాలాగంజు (హైదరాబాదు) లో ఆంధ్రపఠనమందిరమును, శికిందరాబాదులో ౩౦-౯-౧౯౦౫ తేదీని ఆంధ్రసంవర్ధని గ్రంథాలయమును హనుమకొండలో ౨౯ జనవరి ౧౯౦౮ తేదీని రాజరాజనరేంద్ర గ్రంథాలయమును, (మట్టెవాడ) ఓరుగల్లులో ౨౨-౫-౧౯౧౭ తేదీని శబ్దానుశాసన గ్రంథాలయమును, నల్లగొండలో ఆంధ్రసరస్వతీ గ్రంథాలయమును, సూర్యాపేటలో ౨౧ అజూర్ ౧౩౨౬ ఫసలీలో ఆంధ్రవిజ్ఞానప్రకాశినీగ్రంథాలయమును, మంథెనలో ౧౩-౧౧-౨౩ తేదీని ఉస్మానియాగ్రంథాలయమును, మహబూబ్నగరున రుధిరోద్గారి శ్రావణ బ ౧౨ నాఁడు బాలసరస్వతీ గ్రంథాలయమును, ఖమ్మంమెట్టులో విజ్ఞానవిద్యుత్ప్రకాశనీ గ్రంథాలయమును, గార్లలో శ్రీవెంకటేశ్వరగ్రంథాలయమును, హుజూరా

బాదులో దుందుభి చైత్ర శు ౧ నాడు శ్రీవిశ్వేశ్వర గ్రంథాలయమును, తుమ్మలగూడెమున రుధిరోద్గారి శు 3 నాడు ఆంధ్రవిజయగ్రంథాలయమును, మెదకునందు ఆంధ్రభాషాసంజీవనీ గ్రంథాలయమును, కామిడిచర్లలో ౪—౪—౧౩ తేదీన సిద్ధమల్లేశ్వర గ్రంథాలయమును, కోరట్లలో లక్ష్మణరాయ ఆంధ్రగ్రంథాలయమును, కంబమున సరస్వతీనికేతనమును, (కంబముతాలూకా) కొండపల్లిలో విరాట్రియాంధ్రభాషానిలయమును, హైదరాబాదు చుడీబజారున ముదిరాజ విద్యార్థి గ్రంథాలయమును, ఎల్లుపాలెమున మహబూబియా రీడింగు రూమును, హుజూరునగరమున దుర్గావిలాసినీగ్రంథాలయమును, ఖంబమున విద్యార్థినిలయమును, మధిరలో ఉస్మానియా ఆంధ్రభాషానిలయమును, నిజామాబాదులో నిజాముహితచింతకాంధ్రభాషానిలయమును, నల్లగొండలో నీలగిరిగ్రంథాలయమును, మామునూరు (మధిరతాలూకా) లో శ్రీజనార్దననిలయమును, (కరీంనగరుజిల్లా) విసునూరులో విష్ణునగరాంధ్రభాషానిలయమును, కరీంనగరమున ఆంధ్రభాషానిలయమును, సిద్దిపేటలో శ్రీఉమామహేశ్వర ఆంధ్రభాషానిలయమును, కనగల్లున, తాళపత్రగ్రంథనిలయమును, కొలనుపాకలో బహిరాంగ్రంథాలయమును, (కరీంనగరుజిల్లా) పర్కాలులో ఆంధ్రగ్రంథాలయమును, ...

వీనిలో శ్రీకృష్ణదేవరాయల ఆంధ్రభాషానిలయమును, రాజరాజనరేంద్రగ్రంథాలయమును, (హనుమకొండ) ఆంధ్రసంవర్ధనీ నిలయమును మొదలగు నాలుగయిదుమాత్రమే చాలకాలముక్రిందట స్థాపింపఁబడి ప్రసిద్ధికెక్కియున్నవి. తక్కినవిగూడ స్థాపకుల యుత్సాహామునుబట్టి చూచిన అచిరకాలమునందే మిగుల వృద్ధిగాంచునని చెప్పవచ్చును. సొంతభవనములు గలవి రెండుమూడింటికంటె అధికముగ లేవు.

సంఘములు.

ముఖ్యమయినది నిజాంరాష్ట్రాంధ్రజనసంఘము. దీని కేంద్రసంఘము హైదరాబాదునందున్నది. దీనికి శాఖలు ప్రతిజిల్లాయందును, ప్రతితాలూకాయందును నెలకొల్పఁబడుచున్నవి.

స్థలము- నెలకొల్పిన తేదీయు.	ప్రకృతపుకార్యదర్శి.
౧ హైదరాబాదు	మాడపాటి హనుమంతరావుగారు
౨ శికింద్రాబాదు	భోగి సుబ్రహ్మణ్యంగారు
౩ నల్లగొండ	పెండ్యాల శేషాద్రిరావుగారు
౪ వరంగల్ (మట్టెవాడ)	పరచ రంగారావుగారు
౫ సూర్యాపేట	పువ్వాడ వెంకయ్యగారు
౬ మధిర	చతుర్వేదుల కృష్ణయ్యగారు
౭ మహబూబ్ నగర్	యన్. నారాయణరావుగారు
౮ నిజామాబాద్	టి. కె. భాగయ్యగారు
౯ మెదకు (౧౨ మెహర్ ౧౩౩౨ ఫసలీ)	సీతారామరావుగారు
౧౦ కంభంమెట్టు	మాదిరాజు వేంకటేశ్వరరావుగారు
౧౧ కరీంనగర్ (౨౮ మెహర్ ౧౩౩౨ ఫసలీ)	నేమనూరి కిషన్ రావుగారు
౧౨ పరకాల (౨౭-౧-౧౩౩౨ ఫసలీ)	కూరికాల వెంకటేశ్వరరావుగారు
౧౩ జగ్త్యాల	కోట కిషన్ రావుగారు
౧౪ భోనగిరి	గూడా జయరావుగారు
౧౫ మంథెన	మహావాది సీతారామారావుగారు
౧౬ మేడిచలము	శంకరయ్యగారు
౧౭ హుజూరాబాదు	సోమవరపు బసవేశ్వరరావుగారు
౧౮ ఆర్మూరు	కామారెడ్డిగారు

కేంద్రసంఘము ఉపన్యాసములమూలమున జనులలో ప్రబోధము గలిగించుచు శాఖాసంఘములను హెచ్చించుచున్నది. నిజామాబాదునందలి శాఖాసంఘముయొక్క సభ్యులు కొందఱు అనేక స్థలములలో పర్యటనము చేయుచు ప్రబోధము కలిగించుచున్నారు. ఇదిగాక,—౧ యాదవసంఘము, ౨ వైశ్యసంఘము, ౩ ముదిరాజ సంఘము, ౪ విశ్వబ్రాహ్మణజనసంఘము, ౫ ఆదిమాంధ్రజనసంఘము ౬ కళావంతుల సంఘము ౭ ఆంధ్రసోదరీసమాజముఅని యింకనెన్నో యున్నవి. వీనిలో ఆంధ్రవైశ్యసంఘము, యాదవజనసంఘము, ఆంధ్ర సోదరీసమాజము, కళావంతులసంఘము, అనునవి మాత్రము తమ యావచ్ఛక్తితోడను పనిచేయుచున్నవి. తక్కినవి నామమాత్రములు అనఁదగినవిగా నున్నవి.

ఆంధ్రసోదరీసమాజమునుగుఱించి కొంచెము చెప్పవలసియున్నది. కొన్ని సంవత్సరముల క్రిందట ఆంధ్రమహిళాసంఘ మనుపేరున ఒక ఆంధ్రస్త్రీసంఘము కీ. శే. రావిచెట్టి లక్ష్మీనరసాంబగారు జీవించి యున్నప్పుడు నెలకొల్పఁబడి కొంతకాలమువఱకును పనిచేసియుండెను. తరువాత సంవత్సరముక్రిందట ప్రాత సభ్యురాండ్రు కొందరు కలిసి ఆ సంఘమును మఱల ఆంధ్రసోదరీసమాజ మనుపేర నెలకొల్పి ప్రతి ఆదివారమునాడు శ్రీకృష్ణదేవరాయల ఆంధ్రభాషానిలయమున సభలు జరుపుచున్నారు. కొలది దినములక్రిందటనే శ్రీమతి చాట్రాతి లక్ష్మీ నరసాంబగారి యధ్యక్షతక్రింద ప్రథమవార్షికోత్సవము మహావైభవ ముతో జరుపఁబడెను. ఈసోదరీసమాజమునకు నిరంతరము పాటుబడు వారిలోముఖ్యముగా పేర్కొనఁదగినవారు శ్రీమతి నడింపల్లి సుందరమ్మ గారును, కీర్తిశేషు రాలైన చూడమ్మగారునునై యున్నారు.

నిజాంకళాశాలయందు ఆంధ్రవాఙ్మయసంఘమొకటి బ్రహ్మశ్రీ రాయప్రోలు వేంకటరామసోమయాజులుగారి ప్రోత్సాహమున కళా

శాలావిద్యార్థులచే స్థాపింపఁబడి ప్రతి పదునైదుదినములకును చర్చా సభలు జరుగుచుండును. మొన్న మొన్న నే ఆసంఘము పక్షమున శ్రీయుతులు తేకుమళ్ళ రాజగోపాలరావు పంతులుగారు ఆంధ్రవాఙ్మయముయొక్క పూర్వచరిత్రమును గుఱించి చక్కని ఉపన్యాస మిచ్చియున్నారు.

పత్రికలు

ఇచ్చట ఆంధ్రమాత అను నొక ఆంధ్రపత్రిక యుండెడిది. తరువాత పత్రికలు బయలుదేరదీయుటకై ప్రబలప్రయత్నములు జరిగిన మీఁదట నీలగిరి అనువారపత్రిక నల్లగొండనుండియు, తెనుగుపత్రిక అను వారపత్రిక ఇనుగుర్తినుండియు బయలుదేరి ఇప్పటికి సంవత్సరము పైగా నయినది.

ఇందు నీలగిరి ౮ పుటలలో చక్కఁగా ముద్రింపఁబడుచున్నది. పత్రికాధిపతి తనసంపాదకీయవ్యాసములద్వారా ఇచ్చటి జనుల నెల్లపుడును ప్రబోధించుచుండును. ప్రథమసంవత్సరము గడచునప్పటికి ౧,౦౦౦ ఋణమున్నదని ప్రకటింపఁబడి ఇపుడు పత్రికానిర్వహణము ఇతరసాహాయ్యముమీఁద నున్నది.

తెనుగుపత్రిక ౧౨ పుటలు గలిగియుండును. పత్రిక అంతయు ఒకవిధమగు టైపునందే యుండును. విలేఖకులు పంపు వ్యాసములను సక్రమపద్ధతిలో నమర్చుచున్నట్లు తోచదు. ఎట్లో పత్రికను నింపుటకు సామాన్యవ్యాసములను ప్రకటించుటగూడ గలదు. దేశీయులలో నీలగిరిపత్రిక కున్నంత యాదరము దీనికి లేదని వదంతి. ఈపత్రికయొక్క అధిపతులు స్వకీయములగు కార్యము లెన్నియో చేయవలసియున్నవని చెప్పుదురు. అందుచే ఈపత్రికను నిర్వహించుటలో కొంచెము ధననష్టము కలుగకమానదు. దేశమునెడల గల భక్తి వీరినిట్లు పురికొల్పుచున్నట్లు తోఁచుచున్నది.

ఇంగ్లీషున హైదరాబాదునందు "హైదరాబాదుయూత్" అను మాసపత్రిక దిట్టకవి జగన్నాధరావుగారిచే అయిదారుమాసములనుండి ప్రకటింపఁబడుచున్నది. అట్లే శ్రీబాలసరస్వతీ ఆంధ్రభాషానిలయము పక్షమున బాలసరస్వతి అను నొక లిఖితమాసపత్రిక చిత్రపటములతో ప్రకటింపఁబడుచున్నది. ప్రతినెలకును ఒక ప్రతియె తయారుచేయఁబడుచుండుటచే స్థలాంతరములయం దున్నవారికి అది ఉపయోగించుట లేదు; గాని నిలయమునకు వచ్చువారికి అందుబాటులో నుండుటకు మాత్రము బల్లమీఁద నుంచబడుచున్నది.

గ్రంథమాలలు.

ఈదేశమున గ్రంథమాలలు చాల తక్కువ; రెండుమూడుకంటె లేవు. నల్లగొండలోని విజ్ఞాన ప్రచారికామండలి శ్రీవీరేశలింగకంఠాభరణ గ్రంథమాలయు ఇదివఱకు కొన్నిపుస్తకములను ప్రకటించి యున్నవి; గాని వాని కార్యదీక్ష ప్రకృతము నిద్రావస్థలోనున్న దనుట అతిశయోక్తి కాఁజాలదు.

శాసనములు—తాళపత్రగ్రంథములు.

ఈదేశము పూర్వమునుండియు అనేకరాజ్యములకు పుట్టినిల్లగుట వలన శిలాశాసనములు అసంఖ్యములై యున్నవి. తాటియాకుగ్రంథములు అనేకములు దేశీయులవద్ద దాచఁబడియున్నవి. తాటియాకు గ్రంథములను గుఱించి చక్కని యుద్యమమును లేవఁదీయుటలో నీలగిరిపత్రిక ముందంజవేసినది. అందు అనేకశాసనముల వృత్తాంతములు ప్రకటింపఁబడుచున్నవి; గాన బ్రిటిషురాష్ట్రాంధ్రులు తెప్పించుకొని లాభమును బడయుదురుగాక.

ఉపసంహారము.

నిజామురాష్ట్రాంధ్రుల స్థితి క్లుప్తముగా నైన అంతయు తెలుపఁ బూనుటచే ఈవ్యాసమింత పెద్దదయినది. ఈదేశమున ఆంధ్రుల సంఖ్య

అధికమనియు ముందు రాజకీయముగ వీరికి గలుగు లాభములు అనంతము లనియు వేఱుగా నుడువనక్కరలేదు. అన్నివిధములను ముందుకుఁబోవుచున్న మహారాష్ట్రుల యుద్యమము సర్వజనశ్లాఘాపాత్రమై యుండఁగా తాము వెనుకనే యున్నామని ఆంధ్రులు గ్రహించినారు. భగవంతుఁడు ఆంధ్రుల కృషిని సఫలము గావించుఁగాక.

శ్రీకళ్యాణానందస్వగౌరవభంగకరకార్యము.

శ్రీపుష్పగిరిపీఠసంస్థానవిద్వాంసులగు బ్ర॥ వే॥ మల్లాది రామకృష్ణవిద్వన్మహాగ్నిచయనులవారు మా సింహపురి (నెల్లూరు) కి విచ్చేసి యీభాద్రపదశుక్ల ౯ లు గురువారము (27-8-25) మొదలు నాలుగుదివసములు రాజవీధియందుగల శంకరమఠమున నుపన్యాసముల గావించిరి. అందుబ్రథమదివసమున గీతాశాస్త్రమునుగూర్చియు ద్వితీయతృతీయదివసములయందు ఉపాసనావిషయమును గూర్చియు, చతుర్థదివసమున శ్రుతిప్రామాణ్యమునుగురించియు నుపన్యసించిరి. ఆంధ్రలోకమున బ్రసిద్ధిగాంచిన శ్రీచయనులవారి యుపన్యాసరసికతను గూర్చి చెప్పవలసిన దేమియు లేదు. దుర్బోధకమగు తర్క వేదాంత శాస్త్రపఙ్క్తులకుగూడ బాలబోధకముగ నర్థము జెప్పుచు యుపన్యసించిన శ్రీచయనులవారి బోధకతాశక్తి యెంతయు ప్రశంసనీయము. వీరి యుపన్యాసదివసములలో ప్రథమదివసమున శ్రీశృంగేరి శ్రీవిరూపాక్ష శ్రీపీఠాధిపులమని జెప్పుకొనెడి శ్రీమత్కళ్యాణానంద భారతీస్వాములవారు స్వగౌరవభంగకరకార్యము నొకదానిని గావించిరి. దానిని లోకము గ్రహించియుండుట మంచిదని సంగ్రహముగ నీవ్యాసముఖమున ముచ్చటించుచున్నాడను.

శ్రీకళ్యాణానంద భారతులకును శ్రీపుష్పగిరిపీఠాధిపులకును అనవసరకలహములు గలవనుసంగతి సర్వజనవిదితము. చయనులవారు

పుష్పగిరిపీఠసంస్థానవిద్వాంసులు. శ్రీచయనులవారిని పుష్పగిరిపీఠాధిపులను ఇంకను గొంతమందిపండితమండలిని బహిష్కరించితిననిజెప్పుచు బహిష్కారపత్రికయనుపేర కళ్యాణానందు లొక కరపత్రము నిదివరకే గుంటూరుజిల్లాయందు పంచిపెట్టిరి. దాని నిటగూడ బంచిపెట్టి చయనులవారి నేమో చేయవలయుననిగాబోలు శ్రీస్వాములవారు చయనులవారి ప్రథమోపన్యాస దివసమున నాపత్రికల బంచిపెట్టుటకు మ॥ కాకుటూరు సుబ్బారావుగారిని పంపిరి. వారు జేనెడుపొడవు మీసములతో మూరెడుపొడవు ముందరిజుట్టుతో బయలుదేరి సభాప్రారంభము కాగానే యాకరపత్రముల సభలో బంచిపెట్టిరి. అంతటితో దనివినందక యాపత్రికలో కళ్యాణానందులువ్రాసిన తిట్ల నేకరువుపెట్ట నారంభించిరి. పత్రికలబంచినపుడు వారు చదువుకొనరా ! వీరు తిరిగి అందులోనివిషయముల నేకరుపెట్టుట యెందుకు ! ఆయేకరువు సభ్యులకు విసువుగదోచి "మీసంగతిగాని మీకళ్యాణానందులసంగతిగాని యిం దేమియు లేదు. వా రేదో ధర్మవిషయముల నుపన్యసించుచున్నారు. మేము వినుచున్నాము. మీకు యిష్టమున్న వినుడు లేదా దయచేయుడు. అంతియెగాని మీ ప్రస్తావనేమియు లేనిది మీ రల్లరిజేసి సభను విఘ్నపరచుట తగదని "శాంతముగ జెప్పిరి.. దాని బెడజెవినిడి సుబ్బారావుగారు శ్రీపుష్పగిరి పీఠాధిపతులను చయనులవారిని సన్నిపాతరోగివలె యిష్టమువచ్చినటుల దూషింపమొదలిడిరి.

ఆదూషణవినిన నెంతశాంతునకైన క్రోధముజనించకమానదు. అందుచే నాసభాసభ్యులలో నొకరు రావుగారిని మెడబట్టి గెంటబోయిరి. ఆసంభావనజరిగిన గొంతసేపటికి రావుగారు శాంతించిరి. అల్లరి తగ్గెను. సభ నిర్విఘ్నముగ సాగెను. శ్రీకళ్యాణానందభారతీస్వాములవా రిదివరలో యజ్ఞపశువిశసనవిషయమై చయనులవారితో పోరాడినపు డిట్లే బహిష్కారపత్రిక ప్రకటించిరి. అదిమొద లింతవరకు శుద్ధపత్రిక ప్రకటించినటుల కానరాదు. దీనివలన నప్పటినుండియు కళ్యాణానందులదృష్టిలో చయనులవారు బహిష్కారులుగనే

యున్నవారేగదా! బహిష్కారులుగనున్న చయనులవారిని తిరిగి బహిష్కరించుటయు బహిష్కరించితిమని పత్రికలబంచిపెట్టుటయు పనిలేనిపనికాదా! శ్రీకళ్యాణానందస్వాములవారు బహిష్కారపత్రికల బంచిపెట్టుటకు కాకుటూరు సుబ్బారావుగారిని నియమించిరి. రావుగారు రౌడీయని నెల్లూరునందు ప్రసిద్ధివడసినవారు. వీరికంటె స్వాములవారికి సాధువులగు శిష్యులు లేరా! ఉన్నయెడ వారినిపంపక యీ సుబ్బారావుగారినే పంపుటకు కారణమేమి? పంపి వీరు సాధించినదేమున్నది. సుబ్బారావుగారికి జీవాల్లను మెడపోట్లను సంపాదించి యిచ్చుటయేగదా! కళ్యాణానందభారతులు సన్యాసులు. సన్యాసులయందు భక్తిగానుండుట చాతుర్వర్ణ్యసోదరులకు విధియైయున్నది. వారి కాభక్తి స్వాముల యోగ్యతనుబట్టి యుండును. అట్టి యోగ్యతగలిగియుండిన శ్రీకళ్యాణానందులనుగూడ నెత్తినపెట్టుకొనెడివారే. వీరట్లుగాక తాము నిజముగా శ్రీశృంగేరీవిరూపాక్ష పీఠాధిపులుకాకపోయినను తత్పీఠాధిపులమనిచెప్పుటయెగాక శ్రీశృంగేరీ శ్రీపుష్పగిర్యాదిపీఠములుగూడ దమకన్న దక్కువపీఠములనిచెప్పి తద్వారా గౌరవమును సంపాదింపనెంచి సుబ్బారావుగారివంటిశిష్యుల గుంటూరుజిల్లాయందు సంపాదించుకొని వారినాధారముజేసికొని శ్రీపుష్పగిరిపీఠాధిపతులను పండితులనుదూషింపమొదలిడిరి. దానితో యున్నగౌరవముగూడ నశించినది. అంతట గుంటూరునుండి మాపీఠము మేము కదలమనిచెప్పిన శ్రీస్వాములవారు నెల్లూరుచేరవలసివచ్చినది. వచ్చి యూరకుండక బ్రా॥ చయనులవారిని పరాభవింపయత్నించిరి. ఆయత్నము చయనులవారి కేమియు పరాభవము కలుగజేయలేదు. గాని వారికే గౌరవభంగముగావించినది. ఇక నిటనుండిగూడ లేవవలసివచ్చును. కాన శ్రీకళ్యాణానందభారతు లిట్టి స్వగౌరవభంగకరకార్యములచేసి తమగౌరవమును గోల్పోక స్వధర్మమునందు ప్రవర్తించి గౌరవపాత్రులు గాగోరుచు శ్రీస్వాములవారి కనేక నమస్కారములనర్పించి యింతట నీవిషయమును గట్టిపెట్టుచున్నాడను.

క్రోధన భాద్రపద }
బహుళ ౯ లు }

ఇట్లు విన్నవించునది,
హరి సదాశివశర్మ.

—§ త్రిపురాసురసంహారము §—

కం॥ “ కేళీశ్వరీప్రభావం బోలిం దజ్జనన మేటికుదయించెనో యే
కాలమునందో యిదంతయు నాలింపఁ దలంపుగలిగె ననఘా ! మాకుఁన్, ౫౫౫
కం॥ శ్రీమాతయుఁ గాత్యాయనిచాముండులయుం జరిత్ర శ్రవణించితి, మీ
వే మాకుఁ జెప్పియుంటివి, యీమాతచరిత్రగూడ నెఱిఁగింపు దయన్, ౫౫౬
ఆ॥ నమనమాదియైన నానావిధోపచారములచేతఁ దన్ను రహి భజింప
నేమిఫలమొసంగు నీదేవతేశి? కేళీశ్వరాభిధాన మేలవచ్చె? ” ౫౫౭
వ॥ అనియడిగిన సూతుండిట్లనియె, ౫౫౮
మ॥ “ ఒకటే దేవత దేవదైత్యనివహం బోమన్ వధింపన్ ధరన్
బ్రకటించున్ బహురూపముల్, త్రిదశు లెప్పట్లన్ వ్యథోపేతులై
సుకముం బాయుచునుండఁగాఁ గలరో యచ్చో నప్పరాశక్తి శాం
చక లోకత్రయ మాక్రమించి యొకచో సంజాతయౌచుండెడిన్, ౫౫౯
వ॥ మహిషాసురవధార్థమై కాత్యాయనీరూపంబునను శుంభనిశుంభులంబరి మార్పఁ జాముండారూపంబునను గాలయవనుఁబోకార్ప శ్రీమాతృరూపంబునను నంధకాసురుసమయింపఁ గేళీశ్వరీరూపంబునను నవతీర్ణ యయ్యె”ననిన మునీశ్వరులు ౫౬౦
తే॥ “ అంధకాసురుఁ డెవ్వనియాత్మజుండు? కింప్రభావుం? డెటులొప్పెఁడు కీర్తిశేషుఁ
డైనవాఁ ? డెందుకొఱకుఁగా నంబ వానిఁ బిలుకుమార్చెను? సకలంబుఁ దెలుపు
వ॥ అనియడుగుటయు సూతుండిట్లనియె, ౫౬౨ (మున్యు" ౫౬౧
ఆ॥ “ దక్షుబిడ్డ దితికిఁ దనయుఁడై జన్మించి యలహిరణ్యకశిపు వసురారి
యిందుఁ దొట్టిసురల నెల్లరనోడించి స్వయమ యేలియుండె స్వర్గమతఁడు, ౫౬౩
వ॥ తద్వధార్థ మమరులు వర్మచర్మయుతంబులగు నతిముఖ్యానేకశస్త్రంబుల నిర్మించియుఁ జంపఁజాలమిని విష్ణుండు దొడలపైనిడుకొని గోళ్ళచేఁ జీల్చివైచె, వాని కిరువురు కొమరులు, జ్యేష్ఠుండు ప్రహ్లాదుండు, కనిష్ఠుఁ డంధకుండు, హిరణ్యకశిపువు మృత్యువువాతఁబడినపిదప నమాత్యులు ప్రహ్లాదుంగూర్చి వినయోపేతులై ౫౬౪
కం॥ “ పితృపైతామహమగు నీవితతాఖిలరాజ్యభరము వేడుకమైను
న్నతభుజపీఠి వహించుచుఁ గ్రతుభుజులజయింపుమయ్య కదనములోనన్ ” ౫౬౫
వ॥ అనుటయుఁ బ్రహ్లాదుండిట్లనియె, ౫౬౬
ఉ॥ “ చేయనురాజ్యమేను నరసింహునిసాక్షిగ నెంతమాత్రమున్,
జేయమికుండు హేతువును జెప్పెద శ్రద్ధమెయిన్ వినుండు, దై

తేయుల దైనరాజ్యమున దేవత లాశను బెట్టికోరుతా,
మాయసురారులందఱికి నంబుజనాభుఁడు రక్షకుండుగాన్, ౫౬౭

తే॥ విడుతుఁ బ్రాణంబులైనను, విడుచువాఁడ నింటనుండిన సర్వస్వమేని గాని
భక్తి నర్చించి కేల్మోడ్పఁబడిన చక్రితోడ సంగరమొనరింప నోడువాఁడ" ౫౬౮

వ॥ అని పక్కాణించుటయు మంత్రు లన్యోన్య మాలోచించి రెండవపుత్రు రాజ్యంబున స్థాపింప వాఁడు రాజ్య మమాత్యులపైనుంచి పితామహు ధ్యానించుచు

సీ॥ పండి పైవ్రాఁకుల నుండిరాలిన పండ్ల నిరచితాహారుఁడై వేయిరేండ్లు
అగ్గలంబుగ జీర్ణమైన పర్ణములనె విసువక మెసవుచు వేయిరేండ్లు
కడుశ్రిద్ధఁ బలుపరు ల్వాడియఁబోసినయట్టి తోయంబు ద్రావుచు వేయిరేండ్లు
యాదృచ్ఛికంబుగా నగ్రభాగముఁజేరు వాయువుంబీల్చుచు వేయిరేండ్లు
తపముఁజేయఁజేయఁ దచ్చతుర్వర్ష సహస్రములకుఁజివర నంతరంగ
మతిదయాసమేతనుగుటయు సంప్రీతి హంసవాహుఁడచటి కరుగుదెంచి ౫౭౦

వ॥ "నీతపంబునకు మెచ్చి వరమీయవచ్చితి నడుగు" మని యతండు జరామరణంబులు లేకుండ ననుగ్రహింపుమనుటయు, ౫౭౧

ఉ॥ "ఉండునె యొక్కఁడేనియును నుర్వి జరామరణోజ్ఝితుండు? జాతుండగువానికెల్ల నవి తో నరుదెంచెడి, నైననేమి, ధన్యుండవు, నీకు నీఁదగని దుండదు, కావున నిచ్చినాఁడఁ, బ్రీతుండవుకమ్మ, లెమ్మ, పరితుష్టిగ రాజ్యముఁజేయు, పొమ్మఁకన్" ౫౭౩

వ॥ అనిపలికి యంతర్ధానంబుఁజెందుటయుఁ గొంత కాలంబున కంధకుండు,

ఉ॥ "మాజనకుం బితృవ్యుఁ బరిమార్చిరి వేల్పులు మాయఁబన్నితా,
మీజగజెట్టులం గపటమే యొనరింపకయున్నచో సురల్
తేజముచేత నాలమునఁ దీర్పఁగఁజాలరు, కాన నట్టి దు
ర్బీజులఁ బట్టి యందఱిఁ బీఁచమడంచెద, సంహరించెదన్, ౫౭౪

ఉ॥ స్తవ్యములైనకార్యముల సల్పి స్వకీయకులాన కంతకున్
నవ్యయశంబు తేకమను నందనుఁ డాలయసన్నిధాన వా
స్తవ్యమహాధ్వజంబువలె ధారుణి నెంతయు నిప్పిరోజకుం,
డావ్యవహారశూన్యుఁగను నయ్యయు భాగ్యవిహీనుఁ డారయన్" ౫౭౫

వ॥ అనినవిని మంత్రిసత్తములు ౫౭౬

శా॥ "యుక్తంబియ్యది దానవేంద్ర! మన కెంతో వైరు లవ్వారు, దో
శ్శక్తిం బట్టి వధింత మందఱిని, యుష్మత్పాల్యమౌ స్వర్గ మా

సక్తిం బాలనసేయ వీరెవరు, యజ్ఞంబందుఁ బూజించి త్వ
ద్భోక్తవ్యంబును వీరికిచ్చుటకు నా భూదేవు లెవ్వారలక్, ౫౭౭

కం॥ లోకంబులెల్ల బలిమిని జైకొని సంరక్షణంబు గావింతము, త
న్నాకిస్వీక్రియమాణము గా క్రతుభాగంబులెల్ల హరియింత మికన్'' ౫౭౮

వ॥ అని సమయంబొనరించి శక్రునిపై దాడివెడలుటయు నతండును సకలా
మరులతో నెదురునడచి మహాభయంకరంబగు వజ్రంబు నంధకునుద్దేశించి విడువ నా
దనుజోత్తముండు దానిచేఁ గొట్టంబడి హాసంబొనర్చుచు ౫౭౯

కం॥ చూచితి బహుకాలమునకు నీచేతులదైనలావు నేను మహేంద్రా!
నాచేతిలావదెట్టిదొ చూచెదుగా కరుగుదెమ్ము చూపింతు నికన్,, ౫౮౦

వ॥ అనిపలికి ౫౮౧

సీ॥ గణగణమనిమ్రోయు గంటలేయొకనూఱు చుట్టును జెలువారునట్టియదియు
విశ్వకర్మయె తాను విశ్వప్రయత్నంబులొనరించి నిర్మించి యొసఁగినదియు
యమజిహ్వచాడ్పున నత్యంతభయదమై గుండె జల్లనఁజేయుచుండునదియు
నూల్వెట్టికొలిచిన నూఱుమూరలకును దరుఁగనిపొడవునం దనరునదియు
పలురకాలయినుముకలిపి విస్పష్టమై యెత్తనలవిగాక యొసఁగునదియు
నైన గదనువైవనద్దానితాఁకుచే నష్టమూర్ఛనొంది యమరవిభుఁడు ౫౮౨

వ॥ జెండాకట్టియం బట్టుకొని గజమూర్ధంబున నొరగుటయు మహాసేనుండు
శక్తినివిడువ దానవుండు గ్రమ్మతించె, నంత నా షడాననుండు విల్లందుకొని హస్త
లాఘవంబు గనంబఱచుచు ననేకబాణంబు లవ్వానిపై నేయఁబ్రారంభించుచు నఖిలా
మరులు నదియె సందుచేసికొని బాణవర్షంబున దానవానీకిని గప్పివైచిరి, పదపడి
రాక్షసులెల్లరును దేవతాసైన్యంబునంబడి ప్రహారంబులం బీడవెట్టు వారు పరువెత్తిరి,
తాదృగ్భంగపాటునొందిన సురల విలోకించి వృషవాహనుండు సగణుండైవచ్చి
భయపడకుండని యాశ్వాసించి యాథర్వణమంత్రంబులఁ బరాశక్తి నావాహనించి సహా
దైవతంబుగా సాష్టాంగపడి స్తుతించుటయు దేవి యిట్లనియె, ౫౮౩

తే॥ "నను నథర్వణమంత్రంబులను బఠించి యేలయావాహనమొనరించి తిందుమౌళి!
చెప్పు మేఁజేయవలసిన చేఁతయున్న నిపుడె యద్దాని నెఱవేర్చి యేగుదాన" ౫౮౪

వ॥ అనియిట్లు వక్కాణించుటయు మహేశ్వరుండు, ౫౮౫

శా॥ "ఈ యింద్రాదిసమస్తదేవతల దైత్యేశాఁడొ నంధకుం
డాయుక్తిఘులఁజేసి వెళ్లనడఁచెక్ హా స్వర్గమందుండి, యా

న్యాయాపేతుని సంహరింపఁ జనుచున్నాఁడన్ శుచీ! కావునన్
సాయంబీవుపొనర్పఁ గావలయుఁ దత్సంగ్రామరంగంబునన్, ౫౮౬

కం. కేళీమయంబవగు మను వేలకుమించినటువంటి వికృతాకృతులన్
దాలిచి వైశ్వానరమున హేలం బ్రభవించియుంటివీ వటుగానన్, ౫౮౭

కం. కేళీశ్వరియనఁబరఁగుచు హాళిఁ జతుర్దశిని మఱియు నష్టమి నీదృ
గ్లీలాన్విత నినుఁగొలిచెడి త్రైలోక్యస్థితుల కిమ్ము తదభీష్టంబుల్" ౫౮౮

వ. అని వక్కాణించుటయు నా కేళీశ్వరి, ౫౮౯

సీ. శ్రవణించుమాత్రాన జనులు దిగ్భ్రాంతిఁ జెంది భువిమీఁదఁబడిపోవ బొబ్బలిడుచు
వీక్షించుమాత్రాన వెఱపుఁజెంది భటాళి వెనుకకేగ నొడళ్ళు వెంచికొనుచు
సమరమన్ మాత్రాన శస్త్రాస్త్రములఁబట్టి బహిర్ముఖారులపైని బడుచు
ననిఁజొచ్చుమాత్రాన నత్యంతమును బొంగి విఱిచి తల లొన్నటఁ బెట్టుకొనుచు
మాతృగణములు తన కతిమాత్రముగను సాయమొనరింప నీశాన సైన్యములకు
నగ్రభాగంబునం జేరి యాహవంబు జరుపఁదలపడుటయు దైత్యసముదయములు ౫౯౦

వ. హసించువారును భర్త్సించువారును స్త్రీబలంబను లజ్జచేఁ గొట్టనుంకింపక
పౌరుషంబున నిలుచువారును నై యుండు నెడ నారదుం డంధకుసకాశంబునకుం జని

తే. "యుద్ధమొనరింప సిద్ధమైయున్న వీరు స్త్రీలుకా రంధకాసుర! స్త్రీజనౌఘ
సహితయై చక్రిచిహ్నితశయముతోడనున్న కేళీశ్వరీనామ్ని యొక్కకృత్య, ౫౯౧

కం. హరుఁడు తనమేనికండలు కఱకఱను గోఱిగి నిప్పుకల వ్రేల్చి యీ
పరమేశ్వరిఁ బుట్టించెను, దురమొనరుచు నతఁడు నాపై తోడుగ నీతోన్, ౫౯౩

తే. మంత్రబలమున స్త్రీజనసహితముగను వహ్నికుండంబునను సింహవాహయగుచు
జననమందిన యాపెతో సహితుఁడయియె యుగ్రుఁ డుగ్రాకృతిని వచ్చుచున్నవాఁడు,.

శా. "మీమీయిండ్లవసింపుఁడీ క్రితుభుజుల్! మీరంచు దైత్యారులన్
క్షేమోపేతులుగాఁగనుంచి వెస నీజీవంబులం దీయనా
కామధ్వంసి విరించిముందఱఁ బ్రతిజ్ఞంబట్టెఁ గాఁబట్టి నీ
వేమాలోచనచేతో చేసి తెగుచెయ్యింజేయు మోయంధకా!" ౫౯౫

వ. అనివాక్రుచ్చుటయు నంధకుండిట్లనియె, ౫౯౬

క. "రుద్రుఁడనకును జడియను, ద్రుద్రుదుని తాతకును జడియ రూఢిగనే, నీ
క్షుద్రులగు స్త్రీలతోడ నసద్రీతిగ నాచరింప సంగ్రామంబుల్" ౫౯౭

వ. అనియిట్లు వక్కాణించుటయే తడవుగా శక్తిమంతులై యుద్ధమొనరించు
చును మాతృగణంబులచే సాయుధంబుగను సవాహనంబుగను నర్ధభక్షితులై కొండ

ఱును బూర్ణభక్షితులై కొందఱును వధింపఁబడి కొందఱును మహాక్రందనంబొనరింప విని యంధకుండు క్రోధమూర్ఛితుండై ఖడ్గంబు కేలనందుకొని పరువెత్తి విధ్వస్తులను భక్ష్యమాణులను బలాయనపరాయణులను నిహతుల నికటంబునంబడి ప్రలపించు తత్ప్రియభార్యలను సమరోద్యతలగు యోగినులను వీక్షించి యదలించినను వార లెంతమాత్రము భయపడక దానవులం బట్టి సంహరించుచును భక్షించుచును బ్రవర్తించుటయు నతండు తనశరీరంబు దాఁ గాపాడుకొనుచుఁ బెద్ద బొబ్బపెట్టి తమోస్త్రంబుం బ్రయోగింప ముల్లోకంబులును నంధకారబంధురంబులయ్యె, నట్టిది మిట్టని కాని యిది పట్టని కాని తాఁదప్ప నితరుఁ డొకించుకయుఁ దెలిసికొనఁజాలక పరితపించుచు నయ్యోగినులఁ దీక్ష్ణశరంబులం బరిహరించియుఁ దాదృగ్రూపలగు తరుణులు పదిరెట్లు ప్రభవించుటం దిలకించి యస్త్ర ముపసంహరించి శుక్రాచార్యుపాలికిం జని

ఉ॥ “యోగిను లేఁచి యెప్పగిది యుద్ధ మొనర్చుచున్నవారొ యీ
భాగము సంగనుంగొనుము భార్గవ! మంత్రబలంబు పేర్మి నీ
స్త్రీగణ మస్మదస్త్రములచేత నవధ్య, పెటో వధించినన్
వేగజనించి క్రిమ్మఱి ననిం దెగటార్చెడి మద్బలంబులన్, ౫౯౯

కం॥ కావున వెసఁ దద్విద్యను నీవును సాధింపవలయు, నే శ్రీయుతుఁడన్
గావలెనని నీకుండిన నీవిధ మొనరింపు మార్య! హితమతివగుచున్ ” ౬౦౦

వ॥ అని ప్రార్థించుటయు శుక్రుండు సిద్ధిప్రదాయకమ్మగు హాటకేశ్వరక్షేత్రమ్మునకుం జని త్రికోణకుండంబును నిర్మించి విధ్యుక్తంబుగా వీతిహోత్రంబున స్వమాంసంబు వ్రేల్చిన రుద్రునకుం బోలెఁ గేళీశ్వరి సంతుష్టయై వచ్చి ౬౦౧

తే॥ “ మాంసముం గోసి కృష్ణవర్త్మంబునందు వ్రేల్వ కో భార్గవశ్రేష్ఠ! వితగనీవు,
ప్రమథపతిచేత భావింపఁబడినదానఁ, జేయవలసిన దెదో నీవుఁ జెప్పుమద్ది ” ౬౦౨

వ॥ అనియడిగిన శుక్రుండిట్లనియె, ౬౦౩

ఆ॥ ‘ త్రిణయనునకుఁ బోలె దేవి! యంధకునకు నోగిని సాయపడుచు నుండవలయు,
మాతృగణముతిన్న మనుజాశనులఁ గ్రన్న మరల నెట్టులేని మనుపవలయు ’ ౬౦౪

వ॥ అనియిట్లు వాంఛించుటయుఁ గేళీశ్వరి ౬౦౫

ఆ॥ ‘ మాతృగణముతిన్న మనుజాశనులఁ దొట్టి సమరనిహత సర్వసైన్యములును
బ్రతుకఁగలవు శుక్ర! మృతవతీవిద్యామహత్త్వమునను, శాంతినందు మింక ’ ౬౦౬

వ॥ అనిచెప్పి మృతుల బ్రతికింపఁజేసెడి యావిద్య నుపదేశించుటయు శుక్రుండు ప్రహృష్టాంతరంగుండై యంధకుపాలికేగి, ౬౦౭

తే॥ "శంభునకుఁ బోలె నాకుఁ బ్రసన్నయగుచు నొసఁగెఁ గేళీశ్వరీదేవి యొక్క విద్య,
తన్మహత్త్వను హతులైన దైత్యవరుల నెల్లరను బ్రతికించెద నింకఁ జూడు, ౬౦౮

ఉత్సాహము॥ పరమశక్తియగుచు జగముఁ బర్వియుండు నీపైపై
నరసి భక్తినిలుపుచుండు మష్టమిం జతుర్దశిన్,
సురవిరోధి! భక్తిచేత సులభసాధ్యగాని నీ
జరుపుదండనమున కావె సాధ్యగా దెఱుంగుమా" ౬౦౯

వ॥ అని బోధించుటయుఁ దద్దానవేంద్రుండు భావభక్తి సమన్వితుండై యాదేవిని మాతృకల నందఱిని యథాజ్యేష్ఠంబుగం బూజించి నానావిధస్తోత్రంబుల స్తుతించి,

కం॥ "అజ్ఞానంబున నీతోఁ బ్రజ్ఞలు భాషించి కోపపడితిని, త్రిజగ
ద్రాజ్ఞీ! క్షమియింపుము నావిజ్ఞప్తం బాలకింపు, వినతుఁడనయితిన్" ౬౧౧

వ॥ అని యభ్యర్థించిన దేవి యిట్లనియె, ౬౧౨

కం॥ "ఉశనః ప్రభావమున నను వశురాలను జేసికొంటి వత్స! యగును నీ
కు శుభంబు, కాదు నాదుదరిశనము వ్యర్థముగ, నడుగు ప్రీతి వరంబున్" ౬౧౩

వ॥ అనవిని యంధకుండు, ౬౧౪

మత్తకోకిల॥ "ఈసురూపముతోడి నీదగు నిద్ధవిగ్రహ మెంతయున్
భాసురస్థలమందుఁ జేరిచి భక్తిఁ బూజయొనర్చు నా
ధీసమేతుల వాంఛితంబులఁ దీర్చి ప్రోచుచునుండినన్
నీ సుకీర్తి జగంబునందున నిల్చియుండెడి నిచ్చలున్" ౬౧౫

వ॥ అనవుడు వెండియు దేవియిట్లనియె, ౬౧౬

ఉత్సాహము॥ ఎవఁడు నా కిదే సురూప మేరుపఱచి యొక్క స
ద్భవనమునఁ బ్రతిష్ఠఁ జేయు భాగ్యమును గడించునో
భవవిముక్తియుం ద్రివిష్టపంబుఁ బ్రాజ్యరాజ్యమున్
దివిజవైరి! వానికేను దృప్తిమై నొసంగుదున్" ౬౧౭

వ॥ అనియిట్లు వాక్రుచ్చి యాదేవి మాతృగణంబులతోడం గూడి యంధకుండు గాంచుచుండ నంతర్ధానంబుఁ జెందుటయు శుక్రుండు సిద్ధించిన యావిద్యచే మృతులగు రాక్షసులనందఱను బ్రతికించె, వారిం గూడుకొని దానవేంద్రుండు ప్రహృష్టాంతరంగంబున సురపురంబుం బ్రవేశించి నిత్యంబును విశేషించి యష్టమీచతుర్దశులను దద్దేవిని ధ్యానించుచును బూజించుచును నింద్రవైభవం బనుభవించె, నంతఁ దత్ప్రభావంబువిని వ్యాసపుత్రుఁడగు కపింజలుం డీస్థానంబునఁ గేళీశ్వరిం బ్రతిష్ఠించి పరమసిద్ధిం బడసెఁ, బరమేశ్వరియగు కేళీశ్వరీదేవి యీవిధంబున నేర్పడినది, కావున స్థాప్యయు ధ్యేయయుఁ బూజ్యయు నయ్యెడి ౬౧౮

ఆ॥ అంధకుండును దనదు నాచార్యుఁడిడినట్టి మృతవతీసమాఖ్య మేటివిద్యఁ
గీర్తనీయమైన కేశీశ్వరీకృపాబలము వలుకయిడు నవధ్యతయును ౬౧౯

వ॥ చూచుకొని మహేశ్వరునిపై ద్వేషించి దూతంబిలిచి ౬౨౦

కం॥ "చను కైలాసంబునకుం, జని శంకరువంకఁదిరిగి చక్కఁగ వేఁడె
ప్పిన సందేశంబంతయు వినిచి మరలిరమ్ము పొమ్ము వేగమ దూతా! ౬౨౧

ఉ॥ ఇంద్రుని జంకఁబెట్టుకొని యేమెం యొనర్పఁగఁజూచుచుంటి, వా
యింద్రుని విడ్చిపెట్టిన యథేచ్ఛ వసింతువునీవు, లేనిచో
నింద్రుని నిన్ను నీదుసతి నీవువసించు గిరిన్ గణంబులన్
సాంద్రమదీయబాణహతి నాశమెనర్తుఁ బ్రమాణపూర్తిగన్" ౬౨౨

వ॥ అనియిట్లు వక్కాణించుటయు నాదూత ద్రుతంబుగం బోయి యప్పురుష
వచనంబుల వినిపింప వృషభధ్వజుండు కుపితుండై ౬౨౩

సీ॥ దక్షయజ్ఞవినాశనక్షముఁడగుచుం దా వినుతికెక్కినయట్టి వీరభద్రు
గణములలో నగ్రగణనీయుఁడై చాల ఖ్యాతిగాంచిన మహాకాలసంజ్ఞు
వానరాకృతిఁ దన్ను వదలక యేప్రొద్దు నమసేవకుఁడైన నందికేశు
బ్రహ్మాదిసురలకుం బ్రథమపూజ్యుండౌచు సిద్ధులనొడఁగూర్చు సింధురవదను
ఘోరనాదు మహాబలు ఘోరరక్తు నయ్యఘోరు నొకొక్కరుఁ డనుచరులను
గోటికోటిగఁ గైకొని కుమతియైన యంధకాసురుఁ జంపిరా ననుపుటయును ౬౨౪

వ॥ తద్గణంబులు బలవంతుఁడగు నా దానవునిచే నాసాదింపఁబడిన యింద్రపురికి
ధృతాయుధులై యరిగిన దానవులును ధృతాయుధులై కదనంబున కెదురునడచి, రంత
గణంబులు దైతేయులతో రౌద్రంబుగం బోరి జితులై శితికంఠునకడకుఁ బాఱిపో
వతండు తాన బయలువెడలుటయుఁ దక్కుంగల దానవులు దశదిశలకుం బఱచిరి కాని
యంధకుం డెదురుచనియె, నంత, ౬౨౫

సీ॥ కఱకఱమను గొంతు తఱుగుకొం చవలకు గ్రక్కునఁజనెడి చక్రములతోడ
గుఱిచూచివిడిచినంత రయంబ పోయి వర్మముగూడఁ జించు బాణములతోడ
నొరనుండి వెఱికఁగన్ మిఱుమిట్లుగొలిపెడి యమలాతిశిత ఖడ్గములతోడఁ
జేకొద్ది యెత్తివైచినయంతమాత్ర శిరముఁ బగుల్చెడి ముద్గరములతోడ
నన్యతోమరాదికాయుధంబులతోడ వృత్రిగోత్రభిదుల విధముదోఁప
నొండొరు లిణంబు నొనరించి యొసంచి ముష్టియుద్ధమునకు మొనసిరపుడు.

వ॥ అప్పటికిని నంధకుండు చంపశక్యుఁడుగాక తనపట్టునం ద్రవ్యంబకు బం
ధించి మూర్ఛితుం గావించుడుఁ జటిక సేపటికి శితికంఠుండు తెలివినొంది వింతగదం

దచ్ఛిరంబున వైచె, వాఁడును ఖడ్గంబున వ్రేయుటయు ఖండపరశువు కౌబేరాస్త్రం
బుం బ్రయోగించి తద్హృదయంబునఁ దాడనం బొనరించె, నంత నతండు నెత్తురు గ్రక్కు
చుఁ దలక్రిందుగా ధరణిం గూలుటయు శూలంబున గ్రుచ్చియెత్తి గిరగిరం ద్రిప్ప
దానవుండు వినుతించుటయు హరుండు పరితుష్టుండై ౬౨౭

కం॥ "భగవానిచేతఁబడియును బిగివిడి సామంబుగొనుట పెరవీరునకే
మగటిమిగా, దనుజుఁడ, వీవగఁ బొగడుట నీకు వీరవ్రతమగునొకో", ౬౨౮

వ॥ అనినవిని యంధకుండిట్లనియె, ౬౨౯

కం॥ 'శూలాగ్రంబునఁ జేరిచి ఖేలన మొనరింపనుండ గెడపుమునను, మా
ర్జాలము చెరలాటము హా! చాలఁగ నెలుక కగుఁ బ్రాణసంకట మెపుడున్, ౬౩౦

వ॥ నావుడు భగవానుండు ౬౩౧

ఉత్సాహము॥ 'లేదు నీకుఁ జావు గాన లీల శూలమున నిటుల్
నీదువక్షమునను గ్రుచ్చి నింగికెత్తినాఁడ, మ
ర్యాద! యందువలన నీవిఁ కఘసముజ్ఝితుండవై
నాదుగణములందుఁ జేరి నన్ భజించుచుండుమా, ౬౩౨

వ॥ అనుటయు నంధకుండిట్లనియె, ౬౩౩

ఆ॥ "నేటినుండి నీకు నేను నాతోఁడు మా కింకరుండనగుచుఁ గొలచుందు,
నపగతంబు మామకాసురభావంబు, గిరినివేశ! ఘోరదురితనాశ!" ౬౩౪

వ॥ అని యిట్లు వక్కాణించిన వెండియు శంకరుండు ౬౩౫

కం॥ 'నీయెడలఁ జాల సంతసమాయెను వత్స! వచింపు మభివాంఛితమీ,
వీయఁగఁదగనిదె యగుఁగా, కేయభ్యంతరము చెప్ప కిచ్చెద నీకున్" ౬౩౬

వ॥ అనవుడు మఱియు నంధకుఁడు ౬౩౭

కం॥ శూలాగ్రస్థాపిత మత్తాలోపమతనుఁడవగుచుఁ దనరెడి నీ యా
భీలార్చఁ బ్రతిష్ఠించు సుశీలున కపవర్గమిమ్ము శివ! కృపగలవేన్, ౬౩౮

వ॥ అని యభ్యర్థించుటయు మహేశుండు వల్లెయని యస్థిశేషుండును గృశాం
గుండును నగు నయ్యసురుని శూలాగ్రంబునుండి తప్పించె, నంత వాఁడు గణంబులం జేరి
దేవదేవుని ముందర గీతంబుఁ బాడుటయుఁ దద్రటనంబు భృంగరటనంబువోలె శ్రోత్ర
సుఖావహమగుటం జేసి త్రిపురారి భృంగిరిటుండని నామంబు విధియించె, నిట్లతండు
దేవదేవుని గణంబులలోఁ జేరి సర్వకృత్యంబులయందును విశ్వసింపఁదగినవాఁడయ్యె,
నదిమొదలుకొని యీలోకంబున దేవదేవుండగు మహేశ్వరుండు తాదృగ్రూపంబున నె
జనులచే స్థాపింపఁబడుచు నలౌకికంబగు పరమసిద్ధి ప్రసాదించుచున్నవాఁడు, ౬౩౯

సహాయులు.

౮ బేలూరి రామన్న గుప్తగారు, సదాశివునిపేట
౯ రాచూరి సుబ్బయ్యగారు - శ్రీ శ్రీ విరూపాక్షసంస్థాన ప్రధానమంత్రి
౧౦ ఘంటంభట్లగారి వెంకటభుజంగముగారు - ముసలాపురం
౧౧ దండు గుండేరావుగారు, కరణము - ...
౧౨ తిగుళ్ళ కృష్ణారెడ్డిగారు. పటేలు - ...
౧౩ కాకుమాను హనుమయ్యగారు, నర్సారావుపేట
౧౪ తిప్పరాజు కామేశ్వరరావుగారు, కరణం, దుగ్గిరాల
౧౫ భాస్కరరాయని వెంకటరామయ్యగారు, వంగపల్లి
౧౬ నరసింహస్వామివారు, యాదగిరి
౧౭ బీరకాయల రామారావుగారు, రాయగిరి
౧౮ పాలపర్తి గోపాలకృష్ణయ్యగారు, బెజవాడ
౧౯ జూలూరి వెంకటరత్నముగారు, వకీలు, గుంటూరు
౨౦ తుమురుగోటి నరసింహరావుగారు, తిరుమలగిరి.
౨౧ మెదక్ కిషన్ రావు దేశముఖుగారు, నల్లపల్లి
౨౨ నార్నెపాటి వెంకటసుబ్బారావుగారు, నల్లపల్లి
౨౩ జానపాటి సుబ్రహ్మణ్యంగారు, ఆక్టింగు కరణం, పాపయపాలెము
౨౪ చిక్కరాజు పట్టపల్లి రావుగారు, కరణం, చెలకుర్తి
౨౫ కవులూరి నరసింహారావుగారు, ఈలప్రోలు
౨౬ గోటేటి వేణుగోపాలరావుగారు, పోలీసుసబిన్‌స్పెక్టరు, ప్రత్తిపాడు
౨౭ నడింపల్లి నరశింహారావుగారు, రిజిష్ట్రాఫీసు క్లార్కు, క్రోసూరు
౨౮ రాచకొండ వెంకటరామయ్యగారు,యెనమదల
౨౯ సారపరాజు వెంకటలక్ష్మీనరసింహారావు దేశముఖుగారు - తమ్మవరం
౩౦ కప్పగంతు సుబ్బారావుగారు - పోలీసు సబిన్‌స్పెక్టరు - పిడుగురాళ్ళ
౩౧ నండ చినవెంకయ్యగారు, దండమూడి.
౩౨ శ్యామాపంతులగోపాలరావుగారు-బందోబస్తు మొహతెమిమ్-వరంగల్లు
౩౩ తిరుమలనల్లాన్ చక్రవర్తి వరదాచార్యులఅయ్యవార్లంగారు-శాతాపురం
౩౪ కన్నయ్యగారిసంగయ్యగారు-ముసలాపురం
౩౫ చక్కిలం పాపయ్యగారు-ముసలాపురం
౩౬ తాళవెలిమె లింగన్న మొకద్దంగారు-గడిపెద్దాపురం
౩౭ కిషన్ రావు దేశపాండ్యాగారు- తాళ్లపల్లి
౩౮ వెంకటరాజయ్య మక్తేదారు, సీతారాంపురం.
౩౯ తొర్లకొండ లక్ష్మారెడ్డిగారు, క్షీరసాగరం.

అభినవసరస్వతి.

పత్రికాధిపతి:— జానపాటి పట్టాభిరామశాస్త్రి.

ఇది యొకమాసపత్రిక. ఇందు వర్ణాశ్రమధర్మబోధక గ్రంథములును విమర్శనములును వ్యాసములును బ్రకటింపబడును. చందా సం॥ 1 కి రు 3—0—0

ఈ కార్యస్థానమున వెలకుదొరకు పుస్తకములు.

1	కరిణీశోద్ధారిణి [పూరా వీరభద్రకవి]	...	0	4	0
2	వాసంతికాపరిణయ నాటకము	...	0	4	0
3	కంసవధ నాటకము	...	0	8	0
4	చమత్కారమంజరి (సింహాద్రి వెంకటాచార్యులు)		0	4	0
5	విరూపాక్షపీఠగురుపరంపర	...	0	2	0
6	నీతిగీతలు (సుమతిశతకమునకు సంస్కృతము)	...	0	2	0
7	విశ్వబ్రాహ్మణశబ్దఖండనము, బ్రాహ్మణశబ్దవిచారము		0	2	0
8	విగ్రహారాధన ఖండనఖండనము	...	0	4	0
9	చిత్తూరుజిల్లాతీర్పు విమర్శనము (పత్రికాధిపతి)	...	0	4	0
10	సంగదోషము	...	0	3	0
11	పులిందావివాహము (పత్రికాధిపతి)	...	0	4	0
12	వత్సలనీతిశతకము	...	0	1	0
13	శివానందలహరి (తంగెడ రామకృష్ణకవి)	...	0	4	0
14	నర్సారావుపేట శతావధానము (తిరుపతివెంకటీయము)		0	3	0
15	పశ్యాంపుశ్యాం	...	0	2	0
16	పశ్యశబ్దవిచారము	...	0	2	0
17	పురశ్చరణము	...	0	2	0
18	శంతనురాజచరిత్ర	...	0	14	0
19	వర్ణవ్యవస్థ	...	0	4	0
20	స్వర్ణకారవ్యవహారము	...	1	8	0
21	శుద్ధాంధ్రహరిశ్చంద్ర చరిత్రము	...	0	10	0
22	తిరుపతి వెంకటేశ్వరతత్త్వము	...	0	1	0
23	నూతసంహిత-ఆంధ్రము	...	2	0	0
24	స్కాందమహాపురాణాంతర్గతనాగరఖండము (౧ సంపుటము)		1	0	0
25	డిటో నాగరఖండము (౨ సంపుటము)		1	8	0
26	భారతీయప్రబోధము (పిసుపాటి చిదంబరశాస్త్రి)		0	4	0

అభినవసరస్వతీ కార్యస్థానము,
జానపాడు, పిడుగురాళ్ళపోస్టు,
గుంటూరుజిల్లా.